క్లుప్తంగా

'నేడు క్యాంపు కార్యాలయంలో ఉంటా'

భైంసాటౌన్: ముధోల్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయంలో ప్రజలు నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సైతం అందుబాటులో ఉంటారని.. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తద్వారా అధికారుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



చిన్నారి బరువు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

కుంటాల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మెదన్‌పూర్, అంబుగామ గ్రామాల్లో చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను పరిశీలించారు. నెలల వారీగా పెరిగిన బరువు, ఎత్తు వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కౌసల్య, మంగుబాయి తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సుమలతను మండల బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమెను శాలువా తో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపి మండలాధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు లింగాగౌడ్, పో శెట్టి, రమణగౌడ్, భరత్ నారాయణ తదితరులు ఉన్నారు.

నిర్మల్ పట్టణ సీఐ బదిలీ

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ సీఐ అనిల్‌కుమార్‌ను రామగుండంకు బదిలీ చేస్తూ మంగళవారం మల్టీ జోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్.. నిర్మల్ పట్టణానికి సీఐగా రానున్నారు. అనిల్‌కుమార్ సెలవులో ఉండగా.. ఇప్పటికే ప్రవీణ్‌కుమార్ పట్టణ ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలోని హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ గురుస్వామి మూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆరు నెలల్లో రూ. 95,200 ఆదాయం సమకూరినట్లు ఆలయ కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు ఆలయంలోని సుబ్రమణ్యస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నిర్మల్‌టౌన్: నియోజకవర్గం పరిధిలో ఆర్టీసీ బస్సు రాని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మేనేజర్ ప్రతిమారెడ్డిని కలిసి విన్నవించారు. బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని మేనేజర్ పేర్కొన్నారు. గంగాధర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

నర్సాపూర్(జి): అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లకు జరిమానా విధించామని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నర్సాపూర్(జి) గ్రామ శివారు సుద్దవాగు నుంచి ఓ ట్రాక్టర్, డొంగుర్గావ్ శివారు సుద్దవాగు నుంచి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఆర్‌ఐలు వేణుగోపాల్, సుమలత పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అనాథ బాలలుంటే సమాచారం ఇవ్వండి

సోన్: అనాథ బాలలుంటే 1098కు సమాచారం ఇవ్వాలని బాలల పరిరక్షణ అధికారులు శ్రీనివాస్, నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని సిద్ధులకుంటలో తల్లిదండ్రులు లేని ఇద్దరు బాలలు ఉన్నారనే సమాచారంతో మంగళవారం అధికారులు గ్రామానికి వెళ్లి వారి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్తులను విచారించి ఇద్దరు బాలికలను నిర్మల్‌రూరల్ మండలంలోని బాలసదనంలో చేర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు లక్ష్మణ్, నరేందర్, మమత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

టమాటా సాగుతో లాభాలు

- ఎకరాకు రూ.70 వేలు సంపాదిస్తున్న రైతులు
- 25 కిలోల బాక్స్ ధర రూ.800పైనే పలుకుతున్న వైనం



మార్కెట్ తీసుకెళ్లేందుకు సిద్ధంగా టమాటా బాక్స్



లోకేశ్వరంలో టమాటా సాగు

లోకేశ్వరం: ప్రస్తుత సీజన్‌లో టమాటా ధరలు భగ్గుమంటున్నాయి.. కానీ ఆ పంట సాగు చేసిన రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తుంది. దిగుబడితో పాటు ధర బాగుండటమే ఇందుకు కారణం. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు.. రైతుల నుంచి 25 కిలోల టమాటా బాక్సును రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అంగట్లో మాత్రం టమాటా కిలో రూ.50 పలుకుతోంది. ఈసారి ఎక్కువ మంది రైతులు సాగు చేయకపోవడంతో పంటకు డిమాండ్ తగ్గింది.

ముధోల్ డివిజన్‌లో 750 ఎకరాలు..

ముధోల్ డివిజన్‌లో సుమారు 750 ఎకరాల్లో టమాటా పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. బయటకు టమాటా సాగు చేసేవారు తక్కువ కావడంతో వ్యాపారులే వ్యవసాయ క్షేత్రాలకు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీనిని జిల్లాతోపాటు మహారాష్ట్రకూ తరలిస్తున్నారు. దీంతో ఇక్కడి రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది.

ఎకరాకు పెట్టుబడి రూ.30వేలు..

ఎకరం విస్తీర్ణంలో టమాటా పంట వెయ్యి పెట్టెలు(1 పెట్టె 25కిలోలు) దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం దిగుబడి బాగుందని.. రోజు తప్పి రోజు 20 నుంచి 30 బాక్సుల టమాటా పంట దిగుబడి వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టమాటా పంట కాలం మూడు నెలలు. ఈ పంట సాగు చేస్తే దున్నేటప్పటి నుంచి టమాటా తెంపే వరకు అన్ని ఖర్చులు కలిపి రూ.30 వేలు అవుతాయి. ఖర్చులు పోను రూ.70వేలకు పైనే ఆదాయం వస్తుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

నిలకడగా ధర..

మూసధోరణిలో కాకుండా కొందరు రైతులు మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి పంటలు సాగు చేస్తూ లాభాలు పొందుతుంటారు. ఈసారి ఆ బాటలో నడిచేవారిలో టమాటా సాగు చేసే రైతులున్నారు. నెలన్నర రోజుల నుంచి టమాటా ధర నిలకడగా ఉంది.

ముందుగా బాక్సు రూ.600 నుంచి రూ.800 పలికింది. తర్వాత రూ.550కు తగ్గింది. అప్పటి నుంచి రూ.600 కంటే తక్కువ ధర ఏనాడూ పలకలేదు. ప్రస్తుతం రూ.800కు పైనే ఉంది. ఇంత నిలకడగా టమాటా పంటకు ధర ఉండడం ఇదే మొదటిసారని రైతులు అంటున్నారు.

గిట్టుబాటు అవుతోంది



నాకున్న దాంట్లో ఎకరంలో టమాటా పంట సాగు చేశా. ప్రస్తుత సీజన్‌లో ధర బాగుంది. రెండు రోజులకోసారి 25 నుంచి 30 బాక్సుల పంట దిగుబడి వస్తుంది. రోజురోజుకు ధర పెరగడంతో మాకు కూడా గిట్టుబాటు అవుతుంది.

– గోవింద్,రాయపూర్‌కాండ్లీ

లాభాలు వస్తున్నాయి



టమాటా ధర ప్రస్తుతం నిలకగా కొనసాగుతోంది. ఈసారి మంచి లాభాలు వస్తున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తే ఏవరైనా లాభాలు పొందవచ్చు. కష్టానికి ప్రతిఫలం లభించడంతో ఆనందంగా ఉంది.

– ప్రకాశ్, నగర్‌తండా

శుద్ధజలం అందించేందుకు చర్యలు

- డీపీవో శ్రీనివాస్
- గ్రామాల్లో భగీరథ సర్వే పరిశీలన



కుంటాలలో సర్వే పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్



భైంసారూరల్: సర్వే చేస్తున్న డీఈ సత్యనారాయణ

కుంటాల: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ శుద్ధ జలం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మంగళవారం ఆయా గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. ఈ సర్వేలో నల్లా కనెక్షన్ ఉందా.. ఇంటింటా నీరు అందుతుందా?.. లేదా అన్న వివరాలను సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆధార్‌తో కూడిన వివరాలను సర్వే యాప్ లో క్రోడీకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంఏ రహీం, పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, గంగాప్రసాద్, యోగేశ్, దేవన్న, సతీశ్, సుమన్, భోజన్న, రమ్య, సారిక, అరుణ ఉన్నారు.

వానల్‌పాడ్‌లో డీఈ..

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం మిషన్ భగీరథ అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించారు. డీఈ సత్యనారాయణ ఇంటింటా తిరుగుతూ నల్లా కనెక్షన్ల వివరాలు పరిశీలించారు. భగీరథ నీళ్లు వస్తున్నాయా.. లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. యజమాని ఆధార్, ఇంటి ఫొటో, నల్లా ఫొటో, ఫోన్ నంబర్లను నమోదు చేసుకున్నారు. ఆయన వెంట ఏఈ అరుణ్‌కుమార్, సందీప్, కార్యదర్శి గాయత్రి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బడి బాట



సోన్ : సంగంపేటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సోన్: మండలంలోని సంగంపేటతోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం బడిబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సర్కారు బడుల్లోని సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు గ్రామ ప్రత్యేకాధికారులతో కలిసి గ్రామసభలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీల రమేశ్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, నర్సాపూర్, వడ్యాల్, లక్ష్మణచాంద, పార్‌పెల్లి తదితర గ్రామాలలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామసభలు తమ పిల్లలను సర్కారు బడుల్లోకే పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజునాయక్, మోహన్, వింధ్యరాణి, హంసలత, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా భీమన్న పండుగ



కార్యక్రమంలో పాల్గొన్న నాయక్‌పోడ్ కులస్తులు

తానూరు: మండలంలోని మొగ్లిలో ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం భీమన్న పండుగ ఘనంగా నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు పండాలని ఏటా జూన్‌లో వీరు భీమన్న దేవుడికి నైవేద్యం సమర్పించి పూజలు చేస్తారు. నాయక్‌పోడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పడకంటి మాధవ్‌రావ్, సిర్మోల్ల మారుతి, ఎంపీటీసీ లక్ష్మణ్, మోహన్, బాబు, శంకర్, విఠల్, పోతన్న, శంకర్ పాల్గొన్నారు.



కమ్ముకున్న మబ్బులు



జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు కురిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

వైద్యశిబిరం

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న డబుల్‌బెడ్‌రూం కాలనీలో మంగళవారం ఎన్‌డీసీ వైద్యశిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు బీపీ, షుగర్‌తోపాటు ఇతర వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారులు విద్యాలత, చందన, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున హనుమాన్ ఆలయం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నట్లు మండలంలోని పాతతర్లపాడ్ గ్రామ బీజేపీ నాయకులు అన్నారు. సోమిరెడ్డి గంగారెడ్డి, పెద్ది రమేశ్, శ్రీనివాస్, భీమయ్య, సురేశ్, వెంకటేశ్, మల్లేశ్, శ్రీను, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆటా మహాసభల్లో నిర్మల్ వాసులు

నిర్మల్‌చైన్‌గేట్: అమెరికాలోని అట్లాంటాలో ఆటా(అమెరికా తెలుగు సంఘం) నిర్వహించిన మహాసభల్లో నిర్మల్‌కు చెందిన పలువురు పాల్గొన్నారు. స్థానిక రాజశ్యామల పీఠం వ్యవస్థాపకుడు కృష్ణస్వామిని మహాసభల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కృష్ణస్వామి సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని వివరించారు. తెలుగు రాష్ట్రాల ప్రముఖులు, జిల్లావాసులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

కుంటాల:పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లింబా(బి) గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. పంచాయతీల అభివృద్ధి కోసం ఆదాయ వనరులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం కల్లూర్‌లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో ఎంఏ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, మాజీ సర్పంచ్ పెద్దికాపు మల్లేశ్, పంచాయతీ కార్యదర్శులు సుమన్, భోజన్న తదితరులు ఉన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకుందాం

భైంసారూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేగాం గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరకుండా ఉంటాయని పేర్కొన్నారు. డ్రెయినేజీలను శుభ్రం చేసి రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

28 ఏళ్లకు కలిశారు..



పాఠశాల వద్ద పూర్వవిద్యార్థులు

కుంటాల: కుంటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు.

సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. చైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణంలోని అభివృద్ధి పనులపై చర్చించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డుల వారీగా చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కారింగుల సంకీర్తన, జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, ఆఫ్రిన్, కిశోర్‌నాయక్, అబ్దుల్ కలీల్, తొంటి శ్రీనివాస్, ఫౌజియా, కోఆప్షన్ సభ్యులు బండారి కిశోర్, మలాన్ బేగం, కమిషనర్ మనోహర్ ఉన్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి



డిపో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్:ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని, కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్ చేశారు. ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్మల్ బస్ డిపో ఎదుట మంగళవారం ధర్నా చేశారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు బస్సుల్లోనే రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో కిక్కిరిసి ప్రయాణిస్తూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధిక రద్దీతో దివ్యాంగులు, వృద్ధులకు సీట్లు దొరకడం లేదని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు ఏర్పాటు చేయడంతోపాటు కొత్త ఉద్యోగాలు కూడా కల్పించాలన్నారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, గంగామణి, లక్ష్మి, కవిత, విజయ, వసంత, తైసిన్ తదితరులు పాల్గొన్నారు.

మునిపెల్లికి బస్సు ప్రారంభం

లక్ష్మణచాంద: నిర్మల్ నుంచి మునిపెల్లి మీదుగా చింతల్‌చాంద వరకు వెళ్లే బస్ సర్వీసు మంగళవారం ప్రారంభమైంది. ప్రతిరోజు నిర్మల్ నుంచి ఉదయం 10:30 గంటలకు ఒక ట్రిప్పు, సాయంత్రం 4 గంటలకు ఒక ట్రిప్పు నడుపనున్నట్లు ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు. ఎన్నికల వేళ మునిపెల్లికి వచ్చిన రాజకీయ పార్టీల నాయకులకు తమ గ్రామానికి బస్సు వచ్చే ఏర్పాట్లు చేస్తేనే ఓట్లు వేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. సమస్య విన్న మండల బీజేపీ నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్, సురకంటి ముత్యంరెడ్డి, కమల్‌కోట వెంకట్‌రెడ్డి ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి కార్యాలయానికి వెళ్లి సమస్య విన్నవించగా ఎన్నికల అనంతరం బస్సు సర్వీసును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తమకు బస్సు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

'స్ఫూర్తి పొందేలా ప్రభుత్వ చిహ్నం ఉండాలి'

లక్ష్మణచాంద: తెలంగాణలోని 93 శాతం మంది (బీసీ, ఎస్సీ, ఎస్టీలు) స్ఫూర్తి పొందేలా రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం ఉండాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ అన్నారు. మంగళవారం లక్ష్మణచాందలోని తహసీల్దార్ జానకికి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పోరాడిన అంబేద్కర్, సాయన్న, సర్వాయి పాపన్న, సమ్మక్క సారలమ్మ చిత్రపటాలతో కూడిన చిహ్నంను ఆమోదించాలని కోరారు. జిల్లా ప్రచార కమిటీ సభ్యులు సొన్న భూమేశ్, మహారాజ్, కల్లూరు సుధాకర్, రాజు మహారాజ్, కూనింటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలు స్ఫూర్తి పొందేలా ప్రభుత్వ చిహ్నం ఉండాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రామగిరి రవీందర్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు శ్రీనివాస్‌నాయక్, రాథోడ్ వసంత్, భూమేశ్, సుధాకర్‌రాజు, ప్రవీణ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



లోకేశ్వరం: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావ్

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కట్ట చిన్నారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పరామర్శించారు. బీజేపీ నాయకులు సాయన్న, భోజన్న, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముధోల్: మండలంలో వివిధ కారణాలతో చనిపోయిన వారి కుటుంబాలను ముధోల్ ఎమ్మెల్యే రామారావుపాటిల్ పరామర్శించారు. మండలంలోని వెంకటాపూర్‌లో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన నరేందర్ కుటుంబసభ్యులను, కారేగాంలోని ధూమ్‌పల్లి లస్మరెడ్డి తండ్రి అస్వస్థతతో మరణించగా.. వారి కుటుంబ సభ్యులను, మండల కేంద్రంలో గంగారవల్ల పోశెట్టి మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులున్నారు.

ఎమ్మార్సీ కార్యాలయంలో పుస్తకాలు పంపిణీ

తానూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో సుభాశ్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 శాతం పుస్తకాలు అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్వి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, ఉపాధ్యాయులు శంకర్, సీఆర్పీ గంగాధర్, సిబ్బంది గంగాప్రసాద్, మతీన్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం సీఆర్పీ సునీత ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. పీఆర్టీయూ అధ్యక్షుడు జె. రాజారాం, ఉపాధ్యాయులు మల్కాగౌడ్, దేవేందర్, రవీందర్, శ్రీనివాస్‌రావు, భూమన్న, జయసుందర్, భూమేశ్ పాల్గొన్నారు.

'ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి'

కుంటాల: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని నలుగురు వ్యవసాయశాఖ అధికారులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ భైంసా డివిజన్ క్లస్టర్ ఏఈవోలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి కుంటాలలో భైంసా ఏడీఏ వీణకు వినతిపత్రం అందజేశారు. జీలుగు విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడంలో ప్రమేయం లేని ఏవో సాయికుమార్ యాదవ్, ఏఈవోలు జమున, అజ్మీరా దీపిక, అరవింద్‌ను సస్పెన్షన్‌కు గురి చేయడం సరికాదన్నారు.తమను ఇబ్బందులకు గురి చేయొద్దని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899